

పొడదుప్పిపై మానవత్వం
కలసపాడు మండలంలోని సింగరాయపల్లె గ్రామంలో పొడదుప్పిని కుక్కల దాడి నుంచి కాపాడి గ్రామస్తులు మానవత్వం చాటారు.
-8లో



కొత్త పెన్షన్ బిల్లు ఉపసంహరించుకోవాలి
కొత్త పెన్షన్ సవరణ బిల్లును కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథరెడ్డి డిమాండ్ చేశారు.
-8లో

గరిష్టం/కనిష్టం
37.3/22.6

వాతావరణం
జిల్లాలో శనివారం 22.6 – 37.3 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 2.4 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
- కడప అగ్రికల్చర్

బ్రహ్మాండ నాయకుడి బ్రహ్మోత్సవం

- మెరిసిపోతున్న ఏకశిలా నగరి
- నేడు ధ్వజారోహణం
- 14 వరకు నిర్వహణ
- ఏర్పాట్లు పూర్తి

సాక్షి రాయచోటి: ఆంధ్ర భద్రాద్రిగా గుర్తింపు పొందిన ఏకశిలా నగరి బ్రహ్మోత్సవ శోభతో మురిసిపోతోంది. రాష్ట్ర విభజన అనంతరం ఒంటిమిట్ట రామాలయాన్ని అధికారికంగా గుర్తించి.. ప్రభుత్వ లాంఛనాలతో బ్రహ్మోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ప్రత్యేకంగా తిరుమల–తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో జగదభిరాముడి కల్యాణోత్సవం మొదలుకొని బ్రహ్మోత్సవాల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేశారు. ఒంటిమిట్టలోని శ్రీ కోదండ రామస్వామి ఆలయంలో శనివారం రాత్రి వార్షిక బ్రహ్మోత్సవాలకు అంకురార్పణతో శ్రీకారం చుట్టారు. ఆదివారం నుంచి ఈ నెల 14వ తేది వరకు ఉత్సవాలు నిర్వహించనున్నారు.

కనువిందు చేస్తున్న అలంకరణలు

ఏకశిలా నగరిలో శ్రీ కోదండరాముని బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఆలయంతోపాటు పరిసరాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ప్రధానంగా శ్రీరామ నవమి తరుణంలో ఒంటిమిట్టలో ఎక్కడ చూసినా విద్యుద్దీప కాంతులతో వెలుగొందేలా ఆకృతులను రూపొందించారు. అంతేకాకుండా ఆలయ పరిసరాల్లో రంగురంగుల విద్యుద్దీపాలు, విద్యుత్ కటౌట్లతో శోభాయమానంగా అలంకరించారు. ఆలయ గోపుర పరిసర ప్రాంతంతోపాటు కల్యాణ మండపం ప్రాంతంలోనూ వెలుగులు విరజిమ్మేలా ఏర్పాట్లు చేశారు. ఎక్కడ చూసినా పుష్పాలంకరణ కూడా ప్రత్యేకంగా ఆకట్టుకుంటోంది. భక్తులకు ఎండ తగలకుండా చలువ పందిళ్లను ఏర్పాటు చేశారు. పార్కులను సుందరంగా అలంకరించారు. అటువైపు రథం, కోనేరు, ఆలయ పరిసరాలతోపాటు ఇటు హరిత హోటల్ నుంచి అటు స్వామి వారి కల్యాణ మండపం వరకు ఎటుచూసినా ఏకశిలా నగరి శోభాయమానంగా కనిపిస్తోంది.



స్వామి, అమ్మవార్లకు అంకురార్పణ పూజలు నిర్వహిస్తున్న వేద పండితులు



విద్యుద్దీప అలంకరణలో కోదండ రామాలయం

11న స్వామి వారి కల్యాణం

ఒంటిమిట్ట కోదండ రామస్వామి కల్యాణానికి ప్రత్యేకత ఉంది. పండు వెన్నెల్లో చంద్రుని సాక్షిగా జరిగే జగదభిరాముని కల్యాణోత్సవానికి చురుగ్గా ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. ఈ నెల 11న జరగనున్న శ్రీ సీతారాముల కల్యాణోత్సవానికి వచ్చే భక్తులకు ముత్యపు తలంబ్రాలు, అన్నప్రసాదాలు అందించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. అలాగే కల్యాణోత్సవానికి సంబంధించి ముఖ్యమంత్రి పట్టువస్త్రాలు సమర్పించడంతోపాటు గవర్నర్ కూడా హాజరయ్యే సంప్రదాయం ఉన్న నేపథ్యంలో.. బందోబస్తు పరంగా చర్యలు చేపడుతున్నారు. కల్యాణ మండప ప్రాంతంలో ఎల్ఈడీ కాంతులతో సుమారు 38 దేవతామూర్తుల ప్రతిరూపాలను ఏర్పాటు చేస్తున్నారు. సీసీ కెమెరాలు, డ్రోన్లు, పోలీసు సిబ్బంది, పార్కింగ్, తాగునీటికి సంబంధించి మూడు లక్షల వాటర్‌బాటిళ్లు, 250 మంది వైద్య సిబ్బంది, అంబులెన్స్‌లు, అగ్నిమాపక సిబ్బంది, ఇలా అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.

నేడు పోతన జయంతి

ఒంటిమిట్ట(రాజంపేట): ఒంటిమిట్టలో కోదండరాముని బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆదివారం పోతన జయంతిని తిరుమల తిరుపతి దేవస్థానాల ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా కవి సమ్మేళనం ఏర్పాటు చేస్తున్నారు. ఒంటిమిట్ట కోదండ రామాలయం సమీపంలో పోతన విగ్రహాన్ని ఇది వరకే ఏర్పాటు చేశారు. అక్కడ పూజలు నిర్వహించనున్నారు.

ఒంటిమిట్టతో పోతనకు అనుబంధం

ఒంటిమిట్ట చెరువు కింద పోతనకు పొలం ఉంది. ఆయన నివాసం ఉంది. ఆయన నివాసమున్న ప్రాంతాన్ని ఆయన ఇంటి పేరుమీదనే పిలిచారు. దానిని ఇప్పటికీ బొమ్మిదిగడ్డ అనిపిలుస్తుంటారు. ఒకనాటి బమ్మెరగడ్డ ఈనాటికి బొమ్మిదిగడ్డ అయింది. ఆయన భాగవతాన్ని ఆంధ్రీకరించారు. ఆ రామునికే అంకితమిచ్చారు. భాగవతంలో పోతనకు లభించిన స్కంధాలు నాలుగు. అవి అయిదు, ఆరు, పదకొండు, పన్నెండు. మొదటి స్కంధంలో పోతన క్ష కైవల్యపదంబు అంటూ శ్రీకృష్ణప రమ్మాతను స్తుతించారు. ఇక ద్వితీస్కంధం నుంచి కృతిపతిని వర్ణించే పద్యాల్లో 'రఘు' శబ్దంతో ముడిపడ్డ పదబంధాలే కనిపిస్తాయి.

భారీగా తరలి రానున్న భక్తులు

శ్రీరామ నవమి రోజు నుంచి భక్తులు భారీగా తరలి రానున్నారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలతోపాటు తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు తదితర ప్రాంతాల నుంచి తరలివచ్చి స్వామి వారిని దర్శించుకోనున్నారు. బ్రహ్మోత్సవాలు ఈనెల 14వ తేది వరకు జరగనున్న నేపథ్యంలో.. ప్రతిరోజు పెద్ద ఎత్తున భక్తులు వచ్చి స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించనున్నారు. వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా టీటీడీ ఏర్పాట్లు చేసింది.

శాస్త్రోక్తంగా అంకురార్పణ

ఒంటిమిట్ట: ఒంటిమిట్టలో జాంబవంతుడు ప్రతిష్ఠించిన శ్రీ కోదండరామస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలకు శనివారం ఆలయ టీటీడీ డిప్యూటీ ఈవో నటేష్ బాబు ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా అంకురార్పణ చేశారు. తొలుత ఉత్సవ నిర్వాహకుడు రాజేష్‌భట్టర్‌ను సంప్రదాయ బద్ధంగా ఆలయంలోకి తీసుకువచ్చారు. ఉదయం 4 గంటలకు సుప్రభాతంతో స్వామి వారిని మేల్కొలిపి, పరివార దేవతలకు తిరుమంజనం నిర్వహించారు. ఉదయం 5 నుంచి 6 గంటల వరకు వ్యాసాభిషేకం, ఆరాధన, అర్చన చేశారు. రాత్రి 6 నుంచి 8 గంటల వరకు అర్చకులు వేదమంత్రాల నడుమ శాస్త్రోక్తంగా అంకురార్పణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ రంగ మండపంలో ఉత్సవ మూర్తులకు బంగారు ఆభరణాలు, పట్టువస్త్రాలు తొడిగి, తులసి గజమాలతో సుందరంగా అలంకరించారు. అనంతరం ఉత్సవ నిర్వాహకుడు రాజేష్‌భట్టర్ ఉత్సవ మూర్తులకు అంకురార్పణ పూజలు నిర్వహించి, ఆలయంలోని పవిత్ర పుట్టమన్నును యాగశాలలో ప్రతిష్ఠించారు.

నేడు ధ్వజారోహణం

ఆదివారం ఉదయం 9:30 నుంచి 10:15 గంటల మధ్య వృషభలగ్నంలో ధ్వజారోహణం జరుగనుంది. సాయంత్రం 4 నుంచి 7 గంటల వరకు పోతన జయంతి, కవి సమ్మేళనం, రాత్రి 7 నుంచి 9 వరకు శేషవాహన సేవ ఉంటాయి. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో నటేష్‌బాబు, ఇన్‌స్పెక్టర్ నవీన్ కుమార్, ఆలయ అర్చకులు, పండితులు, టీటీడీ సిబ్బంది పాల్గొన్నారు.



పుట్టమన్ను తెస్తున్న ఆలయ ప్రధాన అర్చకులు

కల్యాణోత్సవంలో ప్రతి భక్తుడికి తలంబ్రాలు



సమావేశంలో మాట్లాడుతున్న జేఈఓ వీరబ్రహ్మం

ఒంటిమిట్ట: ఒంటిమిట్టలో ఏప్రిల్ 11న జరగనున్న శ్రీ సీతారాముల కల్యాణోత్సవానికి విచ్చేసే ప్రతి భక్తుడికి ముత్యపు తలంబ్రాలు, అన్నప్రసాదాలు అందజేసే ఏర్పాట్లు చేస్తున్నామని టీటీడీ జేఈఓ వి.వీరబ్రహ్మం తెలిపారు. ఒంటిమిట్టలోని టీటీడీ పరిపాలన భవనం సమావేశ మందిరంలో శనివారం సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేదిక ప్రాంగణం వద్ద ఉన్న 120 గ్యాలరీలలో ఉండే భక్తులతోపాటు కల్యాణం వీక్షించేందుకు వచ్చిన భక్తులందరూ శ్రీ సీతారాముల కల్యాణోత్సవాన్ని వీక్షించేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. వేదిక ప్రవేశ ప్రారంభంలో తలంబ్రాల పంపిణీ కోసం 16 కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. శ్రీ సీతారాముల కల్యాణోత్సవం తిలకించేలా 15 ఎల్ఈడీ స్క్రీన్‌లు, ఆలయం, కల్యాణ వేదిక తదితర ప్రాంతాలలో విద్యుత్ కాంతులతో 38 దేవతామూర్తుల విగ్రహాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. దాదాపు మూడు లక్షల తాగునీరు బాటిళ్లు, 250 మంది పారామెడికల్ సిబ్బంది, 35 మంది వైద్య నిపుణులు, 13 మెడికల్ టీమ్‌లు, ఎనిమిది అంబులెన్సులు, అగ్నిమాపక సిబ్బందిని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. హెచ్‌డీపీపీ 18, దాస సాహిత్య ప్రాజెక్టు 4, అన్నమాచార్య ప్రాజెక్టు 8 ఆధ్వర్యంలో మొత్తం 30 కళా బృందాలతో సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. మొదటిసారి కళాకృతులతో సంక్షిప్త రామాయణాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కల్యాణ వేదిక, ఆలయ పరిసర ప్రాంతాలలో 12 టన్నుల సంప్రదాయ పుష్పాలు, లక్ష కట్ ఫ్లవర్స్‌తో పుష్పాలంకరణలు చేస్తున్నట్లు చెప్పారు. అనంతరం కల్యాణ వేదిక ప్రాంగణం వద్ద ఏర్పాట్లను జేఈఓ పరిశీలించారు. ఆర్డీఓ జాన్ ఎర్విన్ పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

దరఖాస్తుల ఆహ్వానం

కడప ఎడ్యుకేషన్: కడపలోని ఆంధ్రప్రదేశ్ గురుకుల పాఠశాల(మైనార్టీ బాలుర)లో 2025–26 విద్యా సంవత్సరానికిగాను ప్రవేశాల దరఖాస్తుకు ఆదివారంతో గడువు ముగుస్తుందని పాఠశాల ప్రిన్సిపాల్ పేతకంశెట్టి సోమ సత్య శేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. 5వ తరగతిలో, 6, 7, 8 తరగతుల్లో మిగిలిన సీట్లకు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. అభ్యర్థులకు ఏప్రిల్ 25వ తేదీ ప్రవేశ పరీక్ష ఉంటుందని తెలిపారు. వివరాలకు 77801 79446, 90595 00173 నెంబర్లను సంప్రదించాలని తెలిపారు.

సౌమ్యనాథుని ఆలయానికి గ్రాంట్ మంజూరు

కడప కల్చరల్ : ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలోని శ్రీ సౌమ్యనాథస్వామి ఆలయ ఉద్యోగుల జీత భత్యాల కోసం గ్రాంట్–ఇన్–ఎయిడ్ మంజూరుకు ప్రభుత్వం అంగీకరించిందని ప్రభుత్వ కార్యదర్శి వి.వినయ్‌చంద్ తెలిపారు. గ్రాంట్–ఇన్–ఎయిడ్ అనుమతి కోసం టీటీడీ ఈఓ ప్రభుత్వాన్ని కోరారు. స్పందించిన ప్రభుత్వం అనుమతించింది. టీటీడీ పాలన పరిధిలోగల మిగతా 32 ఆలయాలకు కూడా ఈ అనుమతులు వర్తిస్తాయని పేర్కొన్నారు. టీటీడీ ఈఓ తదుపరి చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం సూచించినట్లు వివరించారు.

రైల్వే రిజర్వేషన్ వేళల్లో మార్పు

కడప కోటిరెడ్డిసర్కిల్: కడప రైల్వేస్టేషన్‌లో టిక్కెట్లు రిజర్వు చేసుకునే సమయంలో మార్పులు చేసినట్లు గుంతకల్లు రైల్వే ఉన్నతాధికారులు తెలిపారు. గతంలో ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు రిజర్వేషన్ కౌంటర్ పని చేసేదని పేర్కొన్నారు. ఈనెల 5 నుంచి రిజర్వేషన్ వేళలను ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటల వరకు మార్పు చేశామని వెల్లడించారు. ఆదివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 వరకు ఉంటుందని తెలిపారు.

పర్యావరణం దెబ్బతినకుండా రహదారి పనులు

సిద్దవటం: అటవీ సంపద, పర్యావరణం, వన్యప్రాణులకు ఎలాంటి నష్టం లేకుండా జాతీయ రహదారి పనులు చేపట్టాల్సి ఉందని ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ అజయ్‌కుమార్ నాయక్ తెలిపారు. సిద్దవటం మండలంలోని జేఎంజే కళాశాల సమీపంలో ఉన్న కోతుల వంక బ్రిడ్జి సమీపంలో శనివారం కడప–రేణిగుంట ఎన్‌హెచ్ 716 రహదారికి సంబంధించిన అటవీశాఖ క్లియరెన్స్‌పై నేషనల్ హైవే తిరుపతి ప్రాజెక్టు డైరెక్టర్ వెంకటేశ్వర్లు, సైట్ ఇంజనీర్ దిలీప్‌తో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కడప– రేణి గుంట హైవే పనులకు సంబంధించి ఫైల్ ఢిల్లీ స్థాయిలో పెండింగ్‌లో ఉందని, అనుమతులు రావాల్సి ఉందన్నారు. డీఎఫ్‌ఓ వినీత్ పాల్గొన్నారు.

సామాజిక విప్లవ యోధుడు జగ్జీవన్

కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి



మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి



బాబు జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న ఎస్పీ ఈ.జి అశోక్‌కుమార్

కడప సెవెన్‌రోడ్స్: సామాజిక వివక్షతను జయించిన సామాజిక విప్లవ యోధుడు డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ అని, ఆయనకు దేశం యావత్తు నీరాజనాలు అర్పిస్తోందని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి కొనియాడారు. శనివారం కలెక్టరేట్‌లో సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అదితి సింగ్, డీఆర్వో విశ్వేశ్వర నాయుడు, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ అనితా దీప్తి,జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ డీడీ సరస్వతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సమాజంలో శాంతియుత వాతావరణం నెలకొల్పడం, వివక్షతను నిర్మూలించడంలో ఆయన చేసిన కృషికి గుర్తుగా ఆయన జన్మదినాన్ని భారత ప్రభుత్వం 'సమతా దివస్'గా పరిగణించిందన్నారు. విలువలతో కూడిన ఆయన జీవితం మన అందరికీ ఆదర్శనీయమని, ఆయన అడుగు జాడల్లో నేటి యువత నడవాలని కోరారు. కార్యక్రమంలో ముందుగా జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం కలెక్టర్, అధికారులు,వివిధ సంఘాల నేతలతో కలసి డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఎల్డీఎం జనార్దన్, పరిశ్రమల శాఖ జీఎం చాంద్ బాషా, ఎస్సీ,ఎస్టీ హ్యూమన్ రైట్స్ వెల్ఫేర్ ఫోరం అధ్యక్షుడు జేవీ రమణ, జాతీయ చేతి వృత్తుల ఐక్యవేదిక అధ్యక్షుడు అవ్వారు మల్లికార్జున, లోక్ జనశక్తి పార్టీ ప్రతాపరెడ్డి, మహాజన పార్టీ అధ్యక్షుడు సంగటి మనోహర్, దళిత మిత్ర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె రామాంజులు తదితరులు పాల్గొన్నారు.

మహనీయుడు బాబూ జగజ్జీవన్ రామ్

కడప అర్బన్: దేశ స్వాతంత్ర్య సమరయోధుడు, సంఘసంస్కర్త, భారత మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్ రామ్ జీవితం స్ఫూర్తిదాయకమని ఎస్పీ ఈ.జి అశోక్ కుమార్ కొనియాడారు. శనివారం బాబూ జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన దేశానికి చేసిన సేవలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏ.ఆర్ అదనపు ఎస్పీ బి. రమణయ్య, ఏ.ఆర్ డి.ఎస్.పి కె.శ్రీనివాస రావు, ఆర్ఐలు ఆనంద్, వీరేష్, టైటాస్, శివరాముడు, పోలీస్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు దూలం సురేష్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉప్పు శంకర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

'మౌలానా' అరెస్టు టీడీపీ కుట్ర!

- 'వక్ఫ్ బిల్లు'ను వ్యతిరేకిస్తే అరెస్టు చేస్తారా!
- వక్ఫ్ సవరణ చట్టాన్ని వెనక్కి తీసుకోవాలి
- సమావేశంలో అఖిలపక్ష,ప్రజా సంఘాల నేతల ధ్వజం



సమావేశంలో పాల్గొన్న అఖిలపక్ష, ప్రజా సంఘాల నేతలు

కడప రూరల్: మౌలానా జాకీర్ హుస్సేన్‌ను కుట్రపూరితంగా అరెస్ట్ చేయించడంపై అఖిలపక్ష, ప్రజా సంఘాల నేతలు తీవ్రంగా ఖండించారు. ఈ అరెస్టు వెనక కూటమి నేతల కుట్ర ఉందని ఆరోపించారు. శనివారం కడప వైఎస్సార్ మెమోరియల్ ప్రెస్‌క్లబ్‌లో అఖిలపక్ష, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు అఫ్జల్‌ఖాన్, రాయలసీమ కమ్యూనిస్ట్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్‌రెడ్డి, సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర, జేఏసీ కన్వీనర్ అహ్మద్‌బాబు మాట్లాడుతూ వక్ఫ్ సవరణ బిల్లు ఆమోదం దారుణమన్నారు. మతాల మధ్య విభజన పెంచి దేశ లౌకిక స్వభావాన్ని, మత సామరస్యాన్ని దెబ్బ తీస్తున్నారని ధ్వజమెత్తారు. ఈ బిల్లుకు వ్యతిరేకంగా మత గురువు మౌలానా జాకీర్ హుస్సేన్ గళం విప్పితే ఒక టెర్రరిస్టును అరెస్ట్ చేసిన విధంగా అరెస్ట్ చేయడం దారుణమన్నారు. ఈ పరిణామాల వెనుక టీడీపీ, బీజేపీల హస్తం ఉందని ఆరోపించారు. అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని పేర్కొన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం మౌలానా జాకీర్ హుస్సేన్‌పై పెట్టిన కేసులను వెనక్కి తీసుకోవాలని కోరారు. ప్రస్తుతం సవరించిన వక్ఫ్ చట్టంలో గణనీయమైన మార్పులు తేవడం తగదన్నారు. ముస్లింలు తమ మతాన్ని ఆచరించడానికి రాజ్యాంగం కల్పించిన హక్కులపై దాడి చేయడం దుర్మార్గ చర్యగా అభివర్ణించారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ సవరణ చట్టం 2024ను వెనక్కి తీసుకోవాలని తెలిపారు. తాహిర్, సయ్యద్ సలావుద్దీన్, మక్బూల్‌బాషా, దస్తగిరి, న్యాయవాది అహ్మద్‌అలీ, ఖాన్‌అమీద్ తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్ బిల్లుకు మద్దతిచ్చామంటూ టీడీపీ దుష్ప్రచారం

- ఉభయ సభల్లో వ్యతిరేకిస్తూ వైఎస్సార్‌సీపీ సభ్యులు ఓటేశారు
- లోకేష్ ఆధ్వర్యంలో సోషల్ మీడియా ద్వారా బురదజల్లే యత్నం
- బిల్లులకు మద్దతిచ్చిన టీడీపీ మైనార్టీ ద్రోహిగా నిలిచిపోయింది
- రాష్ట్ర మాజీ ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజద్‌బాషా



కడప సెవెన్‌రోడ్స్: వక్ఫ్ సవరణ బిల్లుకు రాజ్యసభలో వైఎస్సార్‌సీపీ మద్దతు ఇచ్చిందంటూ టీడీపీ నేతలు దుష్ప్రచారానికి దిగడం వారి నీచ సంస్కృతిని బట్టబయలు చేస్తోందని రాష్ట్ర మాజీ ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ.అంజద్‌బాషా ధ్వజమెత్తారు. కడపలో మీడియాతో శనివారం ఆయన మాట్లాడుతూ నారా లోకేష్ ఆధ్వర్యంలో నడుస్తున్న సోషల్ మీడియా వైఎస్సార్‌సీపీపై దుష్ప్రచారానికి పాల్పడుతోందని మండిపడ్డారు. వక్ఫ్ సవరణ బిల్లును లోక్‌సభలో వ్యతిరేకించిన వైఎస్సార్‌సీపీ రాజ్యసభలో మద్దతిచ్చిందంటూ టీడీపీ నేతలు నక్కాఆనంద్‌బాబు, నాగుల్ మీరాలు చెప్పడంలో ఎలాంటి నిజం లేదన్నారు. తమ అధినేత వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మాటకు కట్టుబడే ఉంటారని, లోక్‌సభలో తమ పార్టీ ఫ్లోర్ లీడర్ మిథున్‌రెడ్డి బిల్లుకు వ్యతిరేకంగా మాట్లాడిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. రాజ్యసభలో తమ పార్టీ ఫ్లోర్ లీడర్ వైవీ.సుబ్బారెడ్డి బిల్లును వ్యతిరేకిస్తూ సుమారు పది నిమిషాలు మాట్లాడారన్నారు. వైఎస్సార్‌సీపీ రాజ్యసభ సభ్యులంతా బిల్లుకు వ్యతిరేకంగా ఓటు వేయాలంటూ వైవీ.సుబ్బారెడ్డి జారీ చేసిన విప్‌ను ఆయన ఈ సందర్భంగా ప్రదర్శించారన్నారు. విప్ జారీలో ఇంత స్పష్టంగా ఉన్నప్పటికీ టీడీపీ సోషల్ మీడియా దుష్ప్రచారం చేయడం దారుణమన్నారు. బిల్లుకు అనుకూలంగా రాజ్యసభలో 125 ఓట్లు రాగా, వ్యతిరేకంగా వచ్చిన 95 ఓట్లలో వైఎస్సార్ కాంగ్రెస్‌వే ఏడు ఉన్నాయన్నారు. ఈ విషయం నేషనల్ మీడియా తెలియజేసిందని, పవన్ కల్యాణ్ బిల్లుకు తాము మద్దతు ఇస్తున్నట్లు స్పష్టంగా చెప్పారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇటీవల జరిగిన ఇఫ్తార్ విందులో ముస్లింలపై ఈగ వాలనివ్వబోమని, వక్ఫ్ ఆస్తులకు నష్టం కలగదని, ముస్లింలకు అండగా ఉంటామని మాట్లాడి.. ఇప్పుడు బిల్లుకు అనుకూలంగా ఓటు వేయడం ఆయన నీచ రాజకీయాలకు నిదర్శనమని దుయ్యబట్టారు.

వక్ఫ్ బిల్లును ఆమోదించింది.. కూటమి ప్రభుత్వమే

- ఆ బిల్లుకు ప్రజల ఆమోదం లేదు
- వక్ఫ్ ఆస్తులతో ప్రభుత్వానికి సంబంధం లేదు
- కాపాడుకోవాల్సిన బాధ్యత ముస్లింలపై ఉంది
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్ రెడ్డి

కమలాపురం: లోక్ సభ, రాజ్యసభలో ఎన్‌డీఏ ప్రభుత్వం ప్రవేశపెట్టిన వక్ఫ్ బిల్లును ఏపీలోని కూటమి ప్రభుత్వం ఆమోదించిందని, అయితే ఆ బిల్లును రెండు సభల్లోనూ వైఎస్సార్‌సీపీ తీవ్రంగా వ్యతిరేకించిందని వైఎస్సార్‌సీపీ వైఎస్సార్ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్ రెడ్డి స్పష్టం చేశారు. కమలాపురంలోని పార్టీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కొన్ని పత్రికల్లో, పచ్చ మీడియాలో వైఎస్సార్‌సీపీ లోక్ సభలో వ్యతిరేకించి, రాజ్యసభలో మద్దతిచ్చిందని రావడం అసత్యం అన్నారు. వైఎస్సార్‌సీపీ రెండు సభల్లోనూ పూర్తిగా వ్యతిరేకించిందని ఆయన నొక్కి వక్కాణించారు. మహానేత వైఎస్సార్ ముస్లింల పక్షపాతి అని, ముస్లింలకు 4శాతం రిజర్వేషన్ కల్పించి వారికి విద్య, ఉపాధిలో స్థిరపడేలా చేసిన ఘనత వైఎస్సార్‌కే దక్కుతుందన్నారు. అలాగే ఆయన తనయుడు మాజీ సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ముస్లింల అభ్యున్నతికి ఎంతో కృషి చేశారని, డిప్యూటీ సీఎం పదవి ఇవ్వడంతోపాటు ప్రతి మసీదులో ఇమాం, మౌజన్‌లకు జీతాలిచ్చే పద్ధతి తీసుకువచ్చారన్నారు. చంద్రబాబు రెండు కళ్ల పద్ధతి పాటిస్తున్నారని, ఏపీలో ముస్లింల ఓట్లు దండుకుని, ఢిల్లీలో ముస్లింలు వ్యతిరేకిస్తున్న బిల్లుకు మద్దతు ఇవ్వడం ఏమిటని ప్రశ్నించారు. ఓటర్లను వాడుకొని వదిలేయడం చంద్రబాబు నైజమని ఊసరవెల్లిలా రంగులు మార్చే నాయకుడు ఆయనొక్కడే అన్నారు. వక్ఫ్ ఆస్తులకు ప్రభుత్వానికి ఎటువంటి సంబంధం లేదన్నారు. వక్ఫ్ ఆస్తులను తమ పార్టీ నాయకులకు, బినామీలకు కట్టబెట్టేందుకే చంద్రబాబు వక్ఫ్ బిల్లుకు మద్దతు ఇస్తున్నారన్నారు. బిల్లు ఇలా పాస్ అయిందో లేదో అప్పుడే వక్ఫ్ ఆస్తులను అభివృద్ధి చేయడానికి ఇష్టమున్న వారు ముందుకు రావాలని చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ పేరిట పత్రికల్లో ప్రకటనలు రావడం ఇందుకు నిదర్శనమని, మొబైల్ ఫోన్‌లో చూపిస్తూ ఆరోపించారు. వక్ఫ్ ఆస్తులు దోచేయడానికి టీడీపీ నాయకులు కుట్ర పన్నారని, బిల్లుకు ప్రజల ఆమోదం లేదని స్పష్టం చేశారు. తమ పార్టీ ఎప్పటికీ ముస్లింలకు బాసటగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఆ పార్టీ నాయకులు రాజుపాళెం సుబ్బారెడ్డి, సుమిత్రా రాజశేఖర్‌రెడ్డి, గంగాధర్ రెడ్డి, మహ్మద్ సాదిక్, మారుజోళ్ల శ్రీనివాసరెడ్డి,మోహన్ రెడ్డి, కొండారెడ్డి, ఆర్‌వీఎస్ఆర్, లక్ష్మీ నారాయణరెడ్డి, జగన్ మోహన్‌రెడ్డి, గఫార్, ఖాజా హుసేన్, జిలాని, ఆచారి, జనార్ధన్ రెడ్డి, ఆంజనేయరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, సుదర్శన్ రెడ్డి, జెట్టి నగేష్, శ్రీరాం రమణ, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మోడల్ పరీక్షలోనూ మహిళలదే ఆధిపత్యం



మోడల్ పరీక్షను పర్యవేక్షిస్తున్న నాయకులు

కడప అర్బన్ : కడప బార్ అసోసియేషన్‌లో శనివారం నిర్వహించిన జూనియర్ సివిల్ జడ్జి మోడల్ పరీక్షలో ఎనిమిది మంది మహిళలు ఆధిపత్యం సాధించడమేగాక అధిక మార్కులు సొంతం చేసుకున్నారు. కడప భారత న్యాయవాదుల సంఘం అధ్యక్షులు సి.సుబ్రహ్మణ్యం వర్కింగ్ ప్రెసిడెంట్ టి.ఈశ్వర్ ముందుగానే ప్రకటించడంతో 40 మంది న్యాయవాదులు హాజరయ్యారు. ఈ మోడల్ పరీక్ష శనివారం ఉదయం 11 గంటల నుండి ఒంటిగంట వరకు జరిగింది. కడప బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాఘవరెడ్డి ప్రధాన కార్యదర్శి చంద్రవదన, ఉపాధ్యక్షులు ఉమాదేవి ప్రశ్నపత్రం విడుదల చేశారు. వంద ప్రశ్నలతో కూడిన పరీక్ష పూర్తవగానే కీ విడుదల చేశారు. షేక్ ముస్తఫాకు 86, సి.రాజ్యలక్ష్మికి 84, ఎ.రాహుల్‌కు 80 మార్కులు వచ్చాయి. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు నాగసుబ్బారెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, వెంకటశివ, సురేష్, చిన్నయ్య పాల్గొన్నారు.

సకల గుణాభిరామా.. శ్రీరామా



సకల సద్గుణాలకు మారురూపుగా, మానవాళికి ఆదర్శంగా అపురూపమైన బంధాలకు ఆలవాలంగా నిలిచిన శ్రీరాముడు జన్మించిన శుభదినం. ఆయన సీతారాముడయ్యే శుభలగ్నం వెరసి ఆదివారం శ్రీరామ నవమి వేడుకలను ఘనంగా నిర్వహించుకునేందుకు జిల్లా అంతటా రామాలయాలు పండుగ శోభతో కళకళలాడుతున్నాయి.

నేడు జిల్లా అంతటా కల్యాణానికి ఏర్పాట్లు

కడప కల్చరల్ : సీతా, రాముల కల్యాణ వేడుకలకు జిల్లా వ్యాప్తంగా ఆయా ఆలయాల్లో నిర్వాహకులు చురుగ్గా ఏర్పాట్లు చేశారు. రాష్ట్ర అధికారిక ఆలయం కోదండ రామాలయం జిల్లా ఒంటిమిట్టలో ఉండడంతో జిల్లాకు ప్రత్యేక ప్రాధాన్యం ఏర్పడింది. శ్రీరామ నవమి పండగను జిల్లాలో ఇటీవల భారీగా నిర్మించిన రామాలయాలలో ఘనంగా నిర్వహిస్తారు. శనివారం సాయంత్రానికే ఆలయాలు, వీధుల్లో చలువ పందిళ్లు, షామియానాలు వెలిశాయి. ఇక పండగ రోజున ప్రజలు ఒకే చోట చేరి స్వామి, అమ్మవారి పెళ్లి తిలకించి విందు భోజనాలు చేస్తారు. ఔత్సాహిక భక్తులు, నిర్వాహకులు అందించే పానకం, వడపప్పు, తీర్థ ప్రసాదాలు శ్రీరామ నవమి ప్రత్యేకతను చూపుతాయి. ఓ శుభ కార్యానికి బంధుమిత్రులు, ఇరుగుపొరుగులతో కలిసి రెండు గంటలపాటు ఒకే చోట కలిసి ఉండే అపురూపమైన అవకాశం శ్రీరామ నవమి ఇస్తోంది. జిల్లాలో చిన్న, పెద్ద రామాలయాలు దాదాపు 4 వేలకు పైగా ఉన్నాయి. వాటితోపాటు పెద్ద వైష్ణవాలయాలు కూడా శ్రీరామనవమి పండుగకు సిద్ధమయ్యాయి. ఉదయం పది గంటల తర్వాత ఆయా ఆలయాల్లో పురోహితుల నిర్ణయాన్ని బట్టి సీతారాముల కల్యాణోత్సవాన్ని నిర్వహించేందుకు ప్రత్యేక వేదికలను సిద్ధం చేశారు. భక్త బృందాలు ఆలయాలకు పండగ శోభ కల్పించడంలోభాగంగా మామిడి తోరణాలు, అరటి బోదలతో అలంకరించడం, కల్యాణానికి హాజరయ్యే భక్తులందరికీ ప్రసాదంగా పంచి పెట్టేందుకు పానకం, వడపప్పు తయారు చేయడంలో నిమగ్నమయ్యారు. పలు పెద్ద ఆలయాలలో కల్యాణ అనంతరం మధ్యాహ్నం 12 గంటల నుంచి భక్తులందరికీ విందు ఏర్పాటు చేసేందుకు తగిన ఏర్పాట్లు చేసుకుంటున్నారు. కొన్ని ఆలయాల్లో ఉగాది నుంచి శ్రీరామ నవమి వరకు ప్రతిరోజు ధార్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఆదివారం మధ్యాహ్నం లోపుగా కల్యాణం, సాయంత్రం 6 గంటల నుంచి నగరోత్సవాలు నిర్వహించేందుకు రథాలు, పల్లకీలు సిద్ధం చేసుకుంటున్నారు.

బాబూ జగ్జీవన్‌రాం ఆదర్శప్రాయుడు



బాబూ జగ్జీవన్‌రాం విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి, మేయర్ సురేష్‌బాబు, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

కడప కార్పొరేషన్ : మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రాం ఆదర్శప్రాయుడు అని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి, మేయర్ సురేష్ బాబు, మాజీ డిప్యూటీ సీఎం అంజద్ బాషా అన్నారు. జగ్జీవన్‌రాం జయంతి సందర్భంగా కడప మహావీర్ సర్కిల్‌లో జగ్జీవన్‌రాం విగ్రహానికి పూలమాల వేసి శనివారం నివాళులర్పించారు. అనంతరం జిల్లా పార్టీ కార్యాలయంలో జగ్జీవన్‌రాం చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ ఎస్సీసెల్ నగర అధ్యక్షుడు కంచు పాటి బాబు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ఉప ప్రధానిగా బాబు జగ్జీవన్‌రాం అందించిన సేవలు చిరస్మరణీయమన్నారు. కులాలకు, మతాలు, పార్టీలకు అతీతంగా ఆయనఅనేక సంస్కరణలు తీసుకువచ్చారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్ నాయక్, పార్టీ నాయకులు బి. రెడ్డెన్న, పులి సునీల్, సీహెచ్ వినోద్, కె.బాబు, త్యాగరాజు, ఎం.సుబ్బరాయుడు, బండి ప్రసాద్, పి. జయచంద్రారెడ్డి, యానాదయ్య, బీహెచ్ ఇలియాస్,దాసరి శివప్రసాద్, తోటక్రిష్ణ, షఫీ, బసవరాజు, మునిశేఖర్‌రెడ్డి, ఏ1 నాగరాజు, రత్న కుమారి, బండి మరియలు, సుశీలమ్మ, తులశమ్మ తదితరులు పాల్గొన్నారు.

అరటితోటలో 300 మొక్కలు దగ్ధం



కాలిపోయిన అరటిమొక్కలు

కొండాపురం : మండల పరిధిలోని వెంకయ్య కాలువ గ్రామానికి చెందిన ఎస్.శంకర్‌రెడ్డి అరటి తోటలో 300 మొక్కలు దగ్ధమైన సంఘటన రెండు రోజుల కిందట జరిగింది. రైతు వివరాల మేరకు... తోట సమీపంలోని బీడు భూమిలో ఎండిన గడ్డికి అగ్గిపెట్టడంతో నిప్పు రవ్వలు అరటితోటలో పడ్డాయి. దీంతో సుమారు 300 మొక్కలు కాలిపోయాయి. మొక్కలు గేల వేసే సమయంలో ఈ ఘటన జరగడంతో సుమారు రూ.2లక్షల నష్టం వాటిల్లిందని రైతు తెలిపారు. రైతును ప్రభుత్వం ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

సీతారాముల అనుగ్రహం అందరికీ ఉండాలి

– ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి



పులివెందుల : శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకొని జిల్లా ప్రజలకు కడప ఎంపీ వైఎస్.అవినాష్రెడ్డి శుభాకాంక్షలు తెలియజేశారు. ఒంటిమిట్టలో జరగబోయే సీతారామ కళ్యాణం వైభవంగా జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు. ప్రజలంతా శ్రీరామనవమి పండగను సంతోషంగా జరుపుకోవాలని కోరుకున్నారు.

పర్యావరణంపై అవగాహన ఉండాలి



గ్రీన్ కోర్ క్యాంపులో పాల్గొన్న విద్యార్థులు

కడప ఎడ్యుకేషన్ : విద్యార్థి దశ నుంచే పర్యావరణంపై అవగాహన పెంచుకోవాలని నేషనల్ గ్రీన్ కోర్ జిల్లా కోర్డినేటర్(ఎన్జీసీ) టీవీ.రమణయ్య సూచించారు. ఏపీ ఎన్జీసీ, పర్యావరణ విద్య సౌజన్యంతో నేచర్ క్యాంపు శనివారం నిర్వహించారు. పొలతలలో జిల్లా నుంచి వచ్చిన ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు వృక్ష, జంతు సంబంధమైన విషయాలపై అవగాహన కల్పించారు. స్వచ్ఛ ప్రతిజ్ఞ చేయించి పర్యావరణంపై క్విజ్, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. విజేతలకు కడప పదో తరగతి మూల్యాంకన కేంద్రంలో డీఈఓ షంషుద్దీన్, కడప ఉప విద్యా శాఖాధికారి రాజగోపాల్‌రెడ్డి సర్టిఫికెట్, బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ కోఆర్డినేటర్స్ విజయమోహన్‌రెడ్డి, దానం, రవీంద్ర, సూర్యచంద్ర రెడ్డి, అహల్యాభాయి తదితరులు పాల్గొన్నారు

జువైనల్ జస్టిస్ బోర్డు సభ్యులుగా డాక్టర్ లలిత



కడప ఎడ్యుకేషన్ : జువైనల్ జస్టిస్ బోర్డులో చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులుగా వైవీయూ సైకాలజీ డిపార్ట్‌మెంట్ అసోసియేట్ ప్రొఫెసర్ డా. కె.లలిత ఎంపికయ్యారు. కమిటీ చైర్ పర్సన్‌గా హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ యు.దుర్గా ప్రసాదరావు, ఇతర సభ్యులు ఉన్నారు. విద్యా సంస్థలు, విశ్వవిద్యాలయాల నుండి ప్రొఫెసర్ వి.లలిత కుమారి (సోషియల్ వర్కర్, శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం తిరుపతి), బి పద్మావతి(మెంబర్ ,కమిషన్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ చైల్డ్ రైట్స్)ను సభ్యులుగా ఎంపిక చేశారు. ఈ కమిటీ పదవీకాలం మూడేళ్లు ఉంటుంది.

వైద్యాధికారిపై 'పీజీఆర్ఎస్'కు ఫిర్యాదు

- వివరణ కోరిన 'సీఎంఓ'
- సొంత శాఖ ఉద్యోగే ఆరోపణలు చేయడంపై చర్చనీయాంశం

సాక్షి టాస్క్‌ఫోర్స్ : వైద్య ఆరోగ్య శాఖల్లో అదొక కీలకమైన విభాగం. ఆ శాఖ వైద్యాధికారిపై అక్కడే పనిచేస్తున్న ఓ ఉద్యోగి ముఖ్యమంత్రి కార్యాలయం(సీఎంఓ)లో ఒక భాగమైన పీజీఆర్ఎస్ (పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసల్ సిస్టమ్)కు ఫిర్యాదు చేశారు. ఇది సమస్యలను పరిష్కరించే ఒక వేదిక. విశ్వసనీయ సమాచారం మేరకు ఆ శాఖ ఉద్యోగి ఇటీవల కాలంలో ఆ కార్యాలయంలో జరిగిన అవకతవకలతోపాటు పలు అంశాలపై ఫిర్యాదు చేశారు. డీపీఎం స్థాయి అధికారి సీనియర్ అయినప్పటికీ అతనికి ఎలాంటి బాధ్యతలు అప్పగించకుండా అక్కడ పనిచేసే ఒక అధికారికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. ప్రతి కార్యక్రమానికి.. పలు అంశాలకు సంబంధించి ఇన్‌ఛార్జిగా ఆయనకే బాధ్యతలు అప్పగిస్తున్నారు. అలాగే కొందరు ఉద్యోగులను టీంగా ఏర్పాటు చేసుకొని ఆయన పనులు చేస్తున్నారని, పలు అంశాలపై ఫిర్యాదు చేశారు. ఈ ఆరోపణలపై సీఎంఓ కార్యాలయం ఇటీవల వివరణ కోరింది. సొంత శాఖలో పని చేస్తున్న ఉద్యోగే ఆరోపణలు చేయడంతో ఆ శాఖలోని ఉద్యోగుల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఇప్పటికే అక్కడ పలు అంశాలపై విచారణ సాగుతోంది. వాటికి ఈ ఫిర్యాదు తోడైంది. కాగా 'సీఎంఓ' కోరిన వివరణకు ఒక వారంలోగా సమాధానం ఇవ్వాల్సి ఉంటుంది.

ఫిర్యాదు చేసింది ఎవరు..?

'పీజీఆర్ఎస్'కు ఎవరైనా ఫిర్యాదు చేయాలంటే ఆ వ్యక్తి పేరు, సెల్ నంబర్, ఆధార్ కార్డును సమర్పించాలి. ఆ వివరాల ఆధారంగా అక్కడి నుంచి ఫిర్యాదుదారుడికి సమాచారం వస్తుంది. కాగా ఈ కార్యాలయం నుంచి 'పీజీఆర్ఎస్'కు ఫిర్యాదు చేసిన పత్రంలో కార్యాలయంలో పనిచేసే ఉద్యోగి పేరుతో పాటు సెల్ నంబరు వివరాలను పొందుపరిచారు. అయితే ఫిర్యాదు చేసింది ఆ ఉద్యోగి కాదని తెలియడం గమనార్హం. ఎవరో ఆ ఉద్యోగి పేరును ఉపయోగించుకొని ఆరోపణలు చేశారు. కాగా ఆ శాఖకు చెందిన వారే తమ పేరుకు బదులుగా మరొక ఉద్యోగి వివరాలతో ఫిర్యాదు చేసి ఉంటారనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. మొత్తం మీద ఈ వ్యవహారం పెద్ద దుమారమే లేపింది.

కొత్త పెన్షన్ బిల్లు ఉపసంహరించుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి

కడప ఎడ్యుకేషన్ : కొత్త పెన్షన్ సవరణ బిల్లును కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథరెడ్డి డిమాండ్ చేశారు. కడప ఎస్టీయూ భవన్‌లో జిల్లా అధ్యక్షుడు ఎస్ఎండీ.ఇలియాస్‌బాషా అధ్యక్షతన శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగంలోని 'ఆర్టికల్-14'ను ఉల్లంఘించడం సరి కాదన్నారు. సిపిఎస్/జిపిఎస్ స్థానంలో ఆమోదయోగ్యమైన పెన్షన్ విధానం తెస్తామని కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ అమలు చేయాలని కోరారు. 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన మెమో 57 మేరకు పాత పెన్షన్ వర్తింప చేయాలన్నారు. ఏఐఎస్టీఎఫ్ నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ కత్తినరసింహారెడ్డి మాట్లాడుతూ 12 లక్షల మంది ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్లకు చెల్లించాల్సిన 11వ పీఆర్సీ, డీఏ, సరెండర్ లీవ్, సీపీఎస్ బకాయిలు కలిపి రూ.23వేల కోట్లు ప్రభుత్వం చెల్లించాల్సి ఉందన్నారు. 2024 జనవరి నుంచి ఇప్పటి వరకు పెండింగ్‌లో ఉన్న మూడు విడతల డీఏ మంజూరుకు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్ర సంయుక్త అధ్యక్షుడు కె.సురేష్‌బాబు మాట్లాడుతూ ఏకీకృత సర్వీసు రూల్స్ సమస్య పరిష్కరించి, పర్యవేక్షణాధికారి పోస్టులను భర్తీచేయాలన్నారు. రాష్ట్ర నాయకులు పిల్లిరమణారెడ్డి, కంబం బాలగంగిరెడ్డి, రషీద్‌ఖాన్ మాట్లాడుతూ 70 ఏళ్లు దాటిన పెన్షనర్లకు పది శాతం, 75 సంవత్సరాలు నిండిన పెన్షనర్లకు 15 శాతం అడిషనల్ క్వాంటం పెన్షన్ అమలుచేయాలని కోరారు. అనంతరం బాబు జగ్జీవన్ రామ్ జయంతి, వీణా విజయరామరాజు వర్ధంతి సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సమావేశంలో ఎన్.సంగమేశ్వర్‌రెడ్డి, శివశంకర్, గురుకుమార్, దాదా పీర్, గురు ప్రసాద్, రవిశంకర్‌రెడ్డి, కొత్తపల్లి శ్రీను, వాకా చంద్రశేఖర్, చెన్నకేశవ రెడ్డి మహబూబ్ బాషా, రామ్మోహన్, జిల్లా, మండల కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఈత సరదా తీసింది ప్రాణం



శివ (ఫైల్)

పులివెందుల రూరల్ : మండు టెండల్లో ఉపశమనం కోసం సరదాగా ఈతకు వెళ్లిన యువకుడు, ఓ విద్యార్థికి అకస్మాత్తుగా ఫిట్స్ రావడంతో అక్కడికక్కడే మృతి చెందిన వైనం శనివారం జరిగింది. స్థానికుల వివరాల మేరకు.. పులివెందుల మండలం అచ్చివెల్లి పంచాయతీ పరిధిలోని కానేపల్లె గ్రామానికి చెందిన సుబ్బరాయుడి కుమారుడు శివ(26) పులివెందుల పట్టణంలో ఉద్యోగం చేస్తున్నాడు. తన ఇంటి సమీపంలో కుంట వద్దకు శనివారం సరదాగా ఈత కొట్టడానికి వెళ్లారు. ఈ సమయంలో అతడికి ఫిట్స్ రావడంతో నీటిలో మునిగి మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. పెద్ద దిక్కుగా మారిన కొడుకు చనిపోవడంతో తల్లిదండ్రులు, బంధువులు బోరున విలపించారు.

ముమ్మడిగుంటపల్లెలో మరొకరు..



శ్రీనివాసులు (ఫైల్)

సిద్దవటం : మండలంలోని ముమ్మడిగుంటపల్లె వ్యవసాయ పొలాల్లోని బావిలో ఈతకు వెళ్లి ఫిట్స్ రావడంతో మరో విద్యార్థి మృతి చెందాడు. బంధువుల కథనం మేరకు.. ఒంటిమిట్ట మండలం చొన్నకొత్తపల్లె గ్రామానికి చెందిన పదో తరగతి విద్యార్థి తమ్మిశెట్టి శ్రీనివాసులు(16) శనివారం మధ్యాహ్నం గ్రామస్తులు, స్నేహితులతో కలిసి ముమ్మడిగుంటపల్లె వ్యవసాయ పొలాల్లోని బావిలో ఈత కోసం వెళ్లారు. బావిలో ఈత కొట్టి బయటకు రాగానే శ్రీనివాసులుకు ఫిట్స్ రావడంతో అక్కడికక్కడే మృతిచెందారు.

వడదెబ్బతో దివ్యాంగుడు మృతి

రాజంపేట రూరల్ : ఎండ వేడిమి అధికం కావడంతో వడదెబ్బ సోకి దివ్యాంగుడు కుల్లూరు నరసింహులు(38) శనివారం మృత్యువాత పడ్డారు. పట్టణ శివారులోని డీబీఎస్‌పల్లి అరుంధతి వాడకు చెందిన కుల్లూరు చిన్న నరసింహులు, రంగమ్మలకు ఆరుగురు సంతానం. తల్లిదండ్రులు మరణించడంతో పెద్ద కుమారుడు శ్రీనివాసులు బేల్దారి పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. ఇతనికి తోడుగా దివ్యాంగులైన నరసింహులు, చెంగలరాయుడు బేల్దారి పనికి వెళ్తున్నారు. ఈ క్రమంలో నరసింహులుకు శుక్రవారం నుంచి విరేచనాలు, వాంతులయ్యాయి. శనివారం తీవ్రం కావడంతో తన గృహంలో కుప్పకూలిపోయాడు. హుటాహుటిన పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అప్పటికే డీ హైడ్రేషన్ కారణంగా నరసింహులు మృతి చెందినట్లు వైద్యులు తెలిపారని ఆయన బంధువు మహేశ్వరి తెలిపారు. దాతలు ఆదుకోవాలని కోరారు.


రెండు జేసీబీలు, ట్రాక్టర్ సీజ్

కలికిరి : అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు జేసీబీలు, ఒక ట్రాక్టరును సీజ్ చేసినట్లు సీఐ రెడ్డిశేఖర్‌రెడ్డి తెలిపారు. పోలీసుల కథనం మేరకు... మండలంలోని మేడికుర్తి పరిధిలోని బాహుదానదిలో ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా జేసీబీలతో ట్రాక్టర్లకు ఇసుక వేస్తున్నట్లు అందిన సమాచారం మేరకు దాడులు నిర్వహించారు. నదిలో ఉన్న రెండు జేసీబీలను, ఒక ట్రాక్టరును సీజ్ చేసినట్లు సీఐ తెలిపారు. తదుపరి చర్యల నిమిత్తం తహసీల్దారుకు అప్పగించనున్నట్లు చెప్పారు.

ఏఎల్‌సీసీ మూవీ టీజర్ రిలీజ్

కురబలకోట : ఏఎల్‌సీసీ(ఓ యూనివర్సల్ బ్యాచిలర్) మూవీ టీజర్‌ను అంగళ్లు వద్ద విశ్వం ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా జరిగిన ఫంక్షన్‌లో విశ్వం విద్యా సంస్థల అధినేత ఎం.ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ ఎల్ఆర్ ఫిల్మ్ సర్క్యూట్స్ బ్యానర్‌పై నిర్మించిన ఏఎల్‌సీసీ చిత్రం విజయం సాధించాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. చిత్ర హీరో జెపి.నవీన్, దర్శక, నిర్మాత కోలా లెలీదర్‌రావుకు గుర్తింపు రాగలదని ఆశాభావం వ్యక్తం చేశారు. హీరో నవీన్, నటులు శ్రీనివాసరెడ్డి, ధనుష్, ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.రమణారెడ్డి, ఎఎల్‌సీసీ చిత్ర బృందం పాల్గొన్నారు.

పొడదుప్పిపై మానవత్వం



అడవిలోకి వెళ్తున్న పొడదుప్పి


కలసపాడు : మండలంలోని సింగరాయపల్లె గ్రామంలో పొడదుప్పిని కుక్కల దాడి నుంచి కాపాడి గ్రామస్థులు మానవత్వం చాటారు. అడవి నుండి పొడ దుప్పి గ్రామంలోకి వచ్చింది. కుక్కలు దాడి చేసేందుకు ప్రయత్నించగా గమనించిన సింగరాయపల్లె గ్రామస్తులు అడ్డుకుని పొడ దుప్పిని ఒక ఇంటిలో ఉంచారు. అటవీ అధికారులకు సమాచారం ఇచ్చారు. పోరుమామిళ్ల ఫారెస్టు రేంజ్ అధికారి రఘునాథరెడ్డి ఆదేశాల మేరకు తంబళ్లపల్లె సెక్షన్ అధికారి రమణయ్య, మామిళ్లపల్లె బీట్ అధికారి భారతి, డాగ్ స్క్వాడ్ అధికారి హసన్, గురయ్య, ప్రొడక్షన్ ఫోర్స్ సిబ్బంది చేరుకుని పొడదుప్పిని పరిశీలించారు. అనంతరం గ్రామస్థుల సాయంతో అటవీ వాహనంలో తీసుకెళ్లి తడుకుచెరువు సమీపాన అడవిలో వదిలారు.

అంతర్ జిల్లా దొంగల అరెస్టు

మదనపల్లె : షట్టర్లు తొలగించి దుకాణాల్లో చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు అంతర్ జిల్లా దొంగలను అరెస్టు చేసినట్లు డీఎస్పీ దర్బార్ కొండయ్యనాయుడు తెలిపారు. స్థానిక డీఎస్పీ కార్యాలయంలో అంతర్ జిల్లా దొంగల అరెస్టు వివరాలను శనివారం మీడియాకు ఆయన వెల్లడించారు. కర్నూలు జిల్లా గూడూరు మండలం చనుగొండ్ల గ్రామానికి చెందిన గుజిరీ వ్యాపారి మాదిగజార్జి(26), అన్నమయ్య జిల్లా సుండుపల్లె మండలం భైరవగుట్టకు చెందిన బండపల్లి రెడ్డిశేఖర్(23) ముఠాగా ఏర్పడ్డారు. అన్నమయ్య జిల్లా కురబలకోట, మదనపల్లె, గుర్రంకొండ తదితర ప్రాంతాల్లో దుకాణాల షట్టర్లు తొలగించి దొంగతనాలకు పాల్పడ్డారు. దీంతో జిల్లా ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు ఆదేశాల మేరకు క్రైమ్ సీఐ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలతో విచారణ చేపట్టామన్నారు. సాంకేతికతను ఉపయోగించి నిందితులకు సంబంధించిన పక్కా సమాచారం తెలుసుకున్నామని పేర్కొన్నారు. శనివారం ఉదయం కురబలకోట మండలం కడప-మదనపల్లె రోడ్డులోని కడప క్రాస్ వద్ద నిందితులను అరెస్ట్ చేశామన్నారు. నిందితుల నుంచి కురబలకోట, గుర్రంకొండ, మదనపల్లె, చిత్తూరు, ఆదోని పోలీస్ స్టేషన్లలో నమోదైన కేసులకు సంబంధించిన వస్తువులు...సోనీ టీవీ, ల్యాప్‌టాప్, 50 కిలోల కాపర్‌వైర్, మూడు ట్యాబ్‌లు, ఒక టేబుల్ ఫ్యాన్, సిగరెట్లు, ఆటోరిక్షా స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వాటి విలువ రూ.4 లక్షలు ఉంటుందన్నారు. నిందితులను కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించినట్లు తెలిపారు. కేసు విచారణలో ప్రతిభ కనపరిచిన సీఐ చంద్రశేఖర్, రూరల్ సీఐ సత్యనారాయణ, ముదివేడు ఎస్ఐ దిలీప్‌కుమార్, స్టేషన్ సిబ్బందిని డీఎస్పీ డి.కొండయ్యానాయుడు అభినందించారు.

ప్రజలను రెచ్చగొట్టి పంపిస్తున్నారు

జిల్లా ఎస్పీకి వైఎస్సార్‌సీపీ నేతల వినతి



ఎస్పీని కలిసి వస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

కడప అర్బన్ : అధికార పార్టీ నాయకులు అమాయకులైన ప్రజలను రెచ్చగొట్టి డబ్బులిచ్చి ఇళ్లపైకి పంపిస్తున్నారని, ఇది విష సంస్కృతికి నాంది పలుకుతోందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి.రవీంద్రనాథ్‌రెడ్డి, మాజీ డిప్యూటీ సీఎం ఎస్బీ.అంజద్‌బాషా, నగర మేయర్ సురేష్‌బాబు, ఇతర వైఎస్సార్‌సీపీ నేతలు తెలిపారు. కడప ఎస్పీ బంగ్లాలో శనివారం రాత్రి జిల్లా ఎస్పీ ఈజీ.అశోక్‌కుమార్‌ను వారుకలిసి వినతిపత్రం అందజేశారు. అంజద్‌బాషా మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ కార్యకర్త ఇబ్రహీం మియా చెన్నూరు బస్టాండు వద్ద వ్యాపారం చేసుకుంటుండగా, కొందరు మహిళలు వారి అనుచరులతో వచ్చి విచక్షణారహితంగా కొట్టి నీ అంతు చూస్తామంటూ వార్నింగ్ ఇచ్చి వెళ్లారన్నారు. ఇబ్రహీంమియా తనకు జరిగిన అన్యాయంపై వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు వెళ్లారని, అక్కడి పోలీసులు మియా ఇచ్చిన ఫిర్యాదు తీసుకోలేదన్నారు. మియా తనకు ఫోన్ ద్వారా తెలుపగా వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌కు వెళ్లి సీఐ రామకృష్ణతో మాట్లాడానన్నారు. ఇబ్రహీం మియాకు తగిలిన గాయాలు చూపించి కేసు కట్టాలని విజ్ఞప్తి చేశామన్నారు. ఈ నెల 4న సాయంత్రం 5 గంటలకు అశోక లాడ్జి వద్ద తన ఇంటి నివాస స్థలానికి కొంత మంది మహిళలు వారి అనుచరులు, కొంతమంది మీడియాతో వచ్చి తన చిత్రపటాన్ని ఫ్లెక్సీలను ముద్రించి ఆందోళన చేశారన్నారు. సాధారణంగా తన దృష్టికి వచ్చిన ఏ సమస్యనైనా పరిష్కరించేందుకు తాను ముందుంటానని, అందులో భాగంగానే శుక్రవారం స్టేషన్‌కు వెళ్లి వైఎస్సార్‌సీపీ కార్యకర్త ఇబ్రహీం మియాను పరామర్శించడం జరిగిందన్నారు. గతంలో మేయర్ సురేష్‌బాబు ఇంటి ఎదుట చెత్త వేయించి నిరసిస్తూ కూర్చొన్నారన్నారు. ఇవన్నీ చూస్తుంటే కడపలో ఒక కొత్త సంప్రదాయానికి తెర లేపారన్నారు. తాను రెండుసార్లు ఎమ్మెల్యేగా, డిప్యూటీ సీఎంగా, సురేష్‌బాబు జెడ్పీ చైర్మన్‌గా, రెండు సార్లు నగర మేయర్‌గా, నాలుగుసార్లు జిల్లా అధ్యక్షులుగా పనిచేశామని, తమకే భద్రత లేకపోతే కార్యకర్తలు, సాధారణ ప్రజలకు ఏం భద్రత ఉంటుందో ఆలోచించాలన్నారు. ఈ సంఘటనలపై విచారణ చేసి కఠినమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పులిసునీల్‌కుమార్, ఎస్ఎండీ.షఫీ, దాసరి శివప్రసాద్, దేవిరెడ్డి ఆదిత్య తదితరులు పాల్గొన్నారు.

పెళ్లయిన ఏడాదికి భర్తపై పోక్సో కేసు

బి.కొత్తకోట : పెళ్లయి ఏడాది గడిచి, పాప పుట్టిన తర్వాత మైనర్ బాలికను వివాహం చేశారని గుర్తించి కర్ణాటక రాష్ట్రం బట్లపల్లిలో కేసు నమోదు చేసిన వైనం ఆలస్యంగా వెలుగు చూసింది. సీఐ జీవన్ గంగనాథ్ బాబు వివరాల మేరకు.. కర్ణాటకలోని బట్లపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓబులాపురానికి చెందిన లలితకు తల్లిదండ్రులు లేరు. ఏడాది కిందట 17ఏళ్ల వయసులో బి.కొత్తకోట మండలం గుడిపల్లికి చెందిన మల్లి కార్జున(35)ను వివాహం చేసుకుంది. లలిత గర్భం దాల్చడంతో కర్ణాటక రాష్ట్రం చింతామణి ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లింది. అక్కడి వైద్యులు వయస్సు ఆరా తీసి బట్లపల్లి పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి బి.కొత్తకోట మండలంలో వారు ఉండడంతో ఆ స్టేషన్‌కు బదిలీ చేశారు. జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు ఆదేశాలతో లలిత భర్త మల్లికార్జునపై పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. ఈ దంపతులకు ఒక పాప కూడా పుట్టింది.